సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ముస్లింలకు పెద్దపీట

ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక పరంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మైనారిటీ కమిషన్‌ చైర్మన్‌ ఇక్బాల్‌అహ్మద్‌ పేర్కొన్నారు. -8లో



ప్రమాదంలో మాజీ సైనికుడి మృతి

బార్డర్‌ సెక్యూరిటీ ఫోర్స్‌ (బీఎస్‌ఎఫ్‌)లో విధులు నిర్వహించి రిటైర్డ్‌ అయిన మాజీ సైనికుడు గురువారం కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 88 మెట్రిక్‌ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్‌	310	495
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 178.660 కిలోలు

న్యూస్‌రీల్‌

10న నవోదయ ప్రవేశపరీక్ష

రాజంపేట: జవహర్‌ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతిలో పరిమిత సీట్ల భర్తీకి ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌ ఎం.గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 తరగతిలో ప్రవేశానికి 956 మంది, 11వ తరగతిలో 434 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. 9వ తరగతికి రాజంపేట పట్టణంలో 4 పరీక్షకేంద్రాలు, 11 తరగతికి నవోదయ విద్యాలయంలో పరీక్ష కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ నవోదయ వెబ్‌సైట్‌ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని కోరారు. ఇందులో ఏదైనా సమస్య ఉంటే 94947 67721, 80963 29332, 83099 70824 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు



వాత్సల్య లక్ష్మి

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి వాత్సల్య లక్ష్మి పేరు వండర్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌లో నమోదైంది. గతనెల 28న హైదరాబాద్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో 365 మంది విద్యార్థినులతో వాత్సల్య లక్ష్మి ఏక కాలంలో శివ పంచాక్షరి కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనను వండర్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లో నమోదుచేసి ధృవీకరణ పత్రాన్ని అందించారు. అలాగే పలు సంస్థల వారు అవార్డులతో సత్కరించారు.

26 నుంచి సెమిస్టర్‌ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 26 నుంచి సెమిస్టర్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్‌. ఈశ్వరరెడ్డి తెలిపారు. బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్‌ (రెగ్యులర్‌, సప్లిమెంటరీ), మొదటి సెమిస్టర్‌ (సప్లిమెంటరీ) విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈనెల 26, 27, 28, 29 తేదీలలో, మార్చినెల 1వ తేదీన పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లు, టైంటేబుల్‌ కళాశాలల నుంచి పొందాలని సూచించారు.

పీజీ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్‌, అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టుగాడ్యుయేషన్‌ సెమిస్టర్‌ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ ప్రథమ సెమిస్టర్‌ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌, సైన్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. ఈ పరీక్షలను వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్‌. ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ క్రీడాకారిణికి రజతం

వైవీయూ: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మస్థల్‌లో గురువారం జరిగిన ఆలిండియా అంతర్‌ విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయానికి రజత పతకం లభించింది. వైవీయూ క్రీడాకారిణి లీజా కంసా 59 కేజీల విభాగంలో పాల్గొని రెండోస్థానంలో నిలిచి రజతం కైవసం చేసుకుంది. వైస్‌ చాన్సలర్‌ చింతా సుధాకర్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి క్రీడాకారిణికి అభినందనలు తెలిపారు.

15.60 లక్షల చేప పిల్లలు విడుదల



సోమశిల వెనుక జలాల్లో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

నందలూరు(రాజంపేట): మండలంలోని కోనాపురం గ్రామంలోని సోమశిల వెనుక జలాల్లో గురువారం డీఎఫ్‌ఓలు సుస్మిత, ఇరిగేషన్‌ ఈఈ కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో 15.60 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40శాతం సబ్సిడీతో పలమనేరు, కృష్ణాపురం, చిత్తూరు జిల్లా, కళ్యాణదుర్గం, తిరుపతి జిల్లా నుంచి 15.60 లక్షల చేప పిల్లలు తెప్పించి వెనుక జలాల్లో వదిలేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓలు ఆర్‌ రామ్మోహన్‌, జేవీ రమణ, ఎం ఫ్యాబి,సుబ్బనరసయ్య, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



దేవునికడపలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం



స్వామి, అమ్మవార్లు

రారండోయ్‌ వేడుక చూద్దాం

- నేటి నుంచి దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
- కమనీయం కడప రాయుని చరితం

కడప కల్చరల్‌: ఆంధ్రప్రదేశ్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాలు ఎన్నో ఉన్నాయి. అందులో వేటికి అవి చాలా ప్రత్యేకం. అలాంటి వాటిలో దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఒకటి. విశేష ఖ్యాతి, పురాణ ప్రసిద్ధిగల పర్యాటక ప్రాంతంగా ఈ ఆలయానికి ఎంతో పేరుంది. దీన్ని తిరుమలకు తొలి గడపగా భావిస్తారు. తిరుమల క్షేత్ర పాలకుడు వరహస్వామి అయితే, ఈ క్షేత్ర పాలకుడు హనుమంతుడు. ఎన్నో విశేషాలు గల ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదినుంచి ప్రారంభం కానున్నాయి.

జనమే జయుని ప్రతిష్ట

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ మూల విరాట్‌ను సాక్షాత్తు జనమే జయుడు ప్రతిష్టించాడని కడప కైఫీయత్తులో ఉంది. ఇందులోని సమాచారం ప్రకారం ఈ ప్రాంతానికి మొదట దేవుని గడపగా పేరుండేది. కాలక్రమంలో గడప కడపగా మారింది. జనమే జయుడు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ తిరుమల వచ్చాడని, స్వామిని దర్శించుకుని ఆ రాత్రి అక్కడే నిద్ర చేశారని, కలలో శ్రీ వెంకటేశ్వరుడు కనిపించి తిరుమలలోని చెరువు కట్టపై తవ్వితే విగ్రహం కనిపిస్తుందని, దాన్ని ఫలానా చోట ప్రతిష్టించాలని సూచించినట్లు తెలుస్తోంది. తెల్లవారాక ఆయన చెరువుకట్టపై దాదాపు పూడిపోయి ఉన్న శ్రీ వెంకటేశ్వరుని విగ్రహాన్ని గమనించి ప్రతిష్ట చేసేందుకు సరైన ప్రాంతం కోసం అన్వేషించాడు.తిరుమలకు వాయువ్యంగా పది ఆమడల (ఆమడ అంటే పది మైళ్లు) దూరాన పుష్కరిణి సహితంగా వాయు పుత్రుడైన ఆంజనేయుని క్షేత్రం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ విగ్రహాన్ని అక్కడ ప్రతిష్టించడం మంచిదని భావించారు. ఇందుకు నిదర్శనంగా నేటికీ కడప రాయుని మూల విరాట్‌ వెనుక పది అడుగులకు పైగా ఎత్తుగల ఆంజనేయుని విగ్రహం ఉంది. తొలుత ఈ స్వామిని కడప వెంకటేశ్వర్లు అని పిలిచేవారు. అంజనేయుడు శివుని అంశ గనుక శ్రీవారి ఆలయంతోపాటు ఆ ప్రక్కనే శివాలయాన్ని కూడా నిర్మింపజేశారు.

పాలనా చరిత్ర

దేవునికడపలో ప్రస్తుతం గల రాజగోపురాన్ని, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ రాజగోపురాన్ని ఒకేసారి నిర్మించినట్లు కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది. ఆలయంలోని రాజగోపురంతోపాటు ముఖ మండపం, గర్భాలయం, అంతరాళం ప్రాకారం మట్లి అనంతరాజు నిర్మించాడు. తర్వాత వైదుంబులు, ఓరుగంటి రాజులు, వల్లూరు పాలకులు, సంబెట రాజులు, సాళువ, సంగమ, తుళువ వంశీకులు ఈ క్షేత్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సాక్షాత్తు శ్రీకృష్ణదేవరాయులు పలుమార్లు కడప రాయుడిని దర్శించుకుని మడిమాన్యాలు, ఆభరణాలు సమర్పించుకున్నారు. ప్రతిఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. 2006లో ఈ ఆలయాన్ని టీటీడీ తమపరిధిలోకి తీసుకుంది. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

తిరుమలేశుని తొలిగడప



దేవునికడపను తిరుమలకు తొలిగడపకు భావిస్తాం. ఉత్తర ప్రాంతాల ప్రజలు ఏ కారణంగానైనా తిరుమల వరకు వెళ్లలేకపోతే కడపలోని లక్ష్మి వెంకటేశ్వరుడిని దర్శించుకుంటే వారి మొక్కులు తిరుమలేశునికి చేరుతాయని విశ్వాసం. ఉత్తర ప్రాంతాల వారు తిరుపతికి వెళ్లేటపుడు దేవునికడప స్వామిని దర్శించుకుని వెళుతుంటారు.

నేడు అంకురార్పణ

తిరుపతి : దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణ జరుగనుందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. 10న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని...15న ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరగనుందన్నారు.రూ.300 చెల్లించి గృహస్థులు (ఇద్దరు) పాల్గొనవచ్చని తెలిపారు.

తేదీ	ఉదయం సేవలు	రాత్రి వాహన సేవ
09.02.2024	అంకురార్పణ	సేనాధిపతి ఉత్సవం,
10.02.2024	తిరుచ్చి ధ్వజారోహణం	చంద్రప్రభ వాహనం
11.02.2024	సూర్యప్రభ వాహనం	పెద్దశేష వాహనం
12.02.2024	చిన్నశేష వాహనం	సింహవాహనం
13.02.2024	కల్పవృక్ష వాహనం	హనుమంత వాహనం
14.02.2024	ముత్యపుపందిరి ఉత్సవం	గరుడ వాహనం
15.02.2024	కల్యాణోత్సవం	గజవాహనం
16.02.2024	రథోత్సవం	ధూళి ఉత్సవం
17.02.2024	సర్వభూపాల వాహనం	అశ్వ వాహనం
18.02.2024	వసంతోత్సవం (చక్రస్నానం)	హంస వాహనం, ధ్వజావరోహణం
19.02.2024	--	పుష్పయాగం

దేవునికడపలో కోయిల్‌ ఆళ్వార్‌ సేవ

కడప కల్చరల్‌: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని ప్రాకారాలు, మండపం, గర్భగుడి, పూజాసామగ్రి, శ్రీవారి భాషణం తదితర విభాగాలను శుద్ధిగాంచారు. పసుపు, కుంకుమ, పచ్చకర్పూరం, కర్పూరం, సాంబ్రాణి, వివిద పత్ర విశేషాలతో తయారు చేసిన ద్రవ్యాలతో శుభ్రపరిచారు. ఏడాది పొడవున తెలిసో తెలియకో జరిగిన దోషాల నివారణకు, క్రిమి కీటకాదులు తొలగిపోయేందుకు కోయిల్‌ ఆళ్వార్‌ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేయాలి



ఆర్‌జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న జిల్లా డీఈవో, ఓపెన్‌ స్కూల్‌ కో ఆర్డినేటర్‌

రాయచోటి టౌన్‌: పాఠశాల విద్య బలోపేతానికి అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా డీఈవో శ్రీరాం పురుషోత్తం, ఓపెన్‌ స్కూల్‌ కో ఆర్డినేటర్‌ కె. శ్రీనివాస రాజు గురువారం రాఘవరెడ్డిని కలసి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాటశాల విద్య బలోపేతానికి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటిని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి విద్యాప్రమాణాలను పెంచి రాష్ట్రంలోనే మన జోన్‌ను ఉన్నత స్థాయిలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, కార్యాలయ సిబ్బంది రవీంద్ర, శ్రీధర్‌,ఏబీ రామకృష్ణమ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు కలిసి పనిచేద్దాం

జిల్లా కలెక్టర్‌ అభిషిక్త్‌ కిషోర్‌



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ అభిషిక్త్‌ కిషోర్‌

రాయచోటి: నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో మొదటిసారిగా జరిగే ఎన్నికలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కలిసి పని చేద్దామని జిల్లా కలెక్టర్‌ అభిషిక్త్‌ కిషోర్‌ రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ అంశంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను, నిబంధలను పాటించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో కలిసి ముందుకు సాగుదామన్నారు. ఓటరు జాబితాను స్వచ్ఛీకరించడంలో జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని,ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు.

- జిల్లాలో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల వివరాలను కూడా రాతపూర్వకంగా అందజేయాలని రాజకీయ పార్టీలను కలెక్టర్‌ కోరారు. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌ కాస్టింగ్‌, మైక్రో అబ్జర్వర్‌, అదనపు బలగాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఇంకా ఓటర్లుగా నమోదు కాని వారు, 18–19 సంవత్సరాల యువత ఫామ్‌ 6లో ఓటరు నమోదుకు నేరుగా లేదా ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్‌ కోరారు.
- రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్‌ అభిషిక్త్‌ కిషోర్‌ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కెఎస్‌ జవహర్‌ రెడ్డితో వీసీ అనంతరం జిల్లా కలెక్టర్‌ అధికారులతో మాట్లాడుతూ రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు.

రాజ్యసభలో 'రాజంపేట'కు చోటు!

వైఎస్సార్‌సీపీ వర్గాల్లో నూతనోత్సాహం

రాజంపేట: రాజ్యసభలో రాజంపేటకు తొలిసారిగా చోటు దక్కనుంది. ఈ అవకాశం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. 1952 నుంచి ఉమ్మడి నియోజకవర్గంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కొనసాగాయి. ఉమ్మడి నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచి నేటి వరకు పంజం నరసింహారెడ్డి, టీ.విశ్వనాథరెడ్డి, పార్థసారధి, పాలకొండ్రాయుడు, సాయిప్రతాప్‌, పీవీ మిథున్‌రెడ్డి ఎంపీలుగా కొనసాగారు. కానీ రాజంపేట నుంచి రాజ్యసభకు ఇప్పటి వరకు ఎవరూ వెళ్లలేదు. ఈ అవకాశం ఎంఆర్‌కేఆర్‌ అధినేత మేడా రఘునాథరెడ్డికి దక్కింది. ఈయన ప్రస్తుత శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు కావడం గమనార్హం.

మాటనిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మడమతిప్పరు..మాటతప్పరని మరోసారి నిరూపించాడు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథరెడ్డిని బరిలోకి దింపిన నేపథ్యంలో సీఎం నిర్ణయానికి కట్టుబడిన తరుణంలో ఎమ్మెల్యే సోదరుడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం వెల్లివిరిస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గీయులు తమ నేత ఎంపీ(రాజ్యసభ) కాబోతున్న డాన్న ఆనందం అవధులు దాటుతోంది. మేడా సొంత మండలంతోపాటు పలు మండలాల్లో వైఎస్సార్‌ సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

సీఎం నిర్ణయమే శిరోధార్యం



నా తమ్ముడు మేడా రఘునాథరెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం. ముఖ్యమంత్రికి ఎప్పటికీ విధేయులుగా ఉంటాం. సీఎం నిర్ణయమే శిరోధార్యం.

–మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిది




ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. గత ఎన్నికల్లో నా అన్న మేడా మల్లికార్జునరెడ్డికి వైఎస్సార్‌సీపీ టికెట్‌ ఇచ్చి రాజంపేట ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం కల్పించారు. మా అన్నకు ఈ సారి అవకాశం లేనప్పటికి, తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప మనిషి వైఎస్‌ జగన్‌. నా ఊపిరి ఉన్నంతవరకు వైఎస్సార్‌ కుటుంబం వెంటే ఉంటా. నన్ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ అభ్యర్థి

గూండారాజ్‌!

- కడపలో పెట్రేగిపోతున్న టీడీపీ శ్రేణులు
- కార్పొరేటర్‌ కుమారుడు పీరుల్లాపై హత్యాయత్నం
- మొన్న వలంటీర్‌ కుటుంబంపై దౌర్జన్యం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి దంపతుల దౌర్జన్యకాండ



సాక్షి ప్రతినిధి, కడప: శాంతిభద్రతలకు నిలయంగా, మత సామరస్యానికి ప్రతీకగా.. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న జిల్లా కేంద్రమైన కడపలో దౌర్జన్యకర ఘటనలు జరుగుతున్నాయి. ఏదో ఒకచోట టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెండు నెలల తర్వాత అధికారం మాదే, మేమేంటో చూపిస్తామంటూ అధికారులను సైతం బ్లాక్‌మెయిల్‌ చేస్తున్నారు.ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ శ్రేణులు గూండారాజ్‌ను మరిపిస్తున్నారు. ఇదివరకు ఎన్నడు లేనివిధంగా టీడీపీ ఇన్‌చార్జిగా ఆర్‌ మాధవీరెడ్డి నియామకమయ్యాక ప్రత్యక్ష ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కార్పొరేటర్‌ షబానా కుమారుడు పీరుల్లా(26)పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. కడప నగరం మోచంపేట 39వ డివిజన్‌ టీడీపీ ఇన్‌చార్జి అరీఫ్‌ మరికొంతమంది కలిసి పీరుల్లాపై గురువారం హత్యాయత్నానికి పాల్పడ్డారు. మొన్న మృత్యుంజయకుంట సమీపంలో మాధవీరెడ్డి 'బాబు ష్యూరిటీ, భవిష్యత్‌ గ్యారెంటీ'కార్యక్రమంలో భాగంగా ప్రచారానికి వెళ్లింది. ఇంటింటా టీడీపీ స్టిక్కర్లు గృహస్తుల అనుమతి లేకుండా అతికించారు. గమనించిన వలంటీర్‌ ఆంజనేయులు తన ఇంటికి టీడీపీ స్టిక్కర్‌ అతికిస్తుంటే అభ్యంతరం చెప్పారు. నా అనుమతి లేకుండా ఇలా చేయొద్దన్నందుకు టీడీపీ నేతలు దేరంగుల శివ, శివశంకర్‌ వాదనకు దిగారు. వలంటీర్‌పై దాడి చేశారు. అంతటితో ఆగకుండా మాధవీరెడ్డి తన ప్రైవేటు సైన్యంతో అక్కడికి వెళ్లి రచ్చ చేశారు. ఈవ్యవహారం చిన్నచౌక్‌ పోలీసుస్టేషన్‌కు చేరింది. పోలీసుస్టేషన్‌లో సైతం పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి రెండు నెలల్లో మా ప్రభుత్వం వస్తుంది, తర్వాత నేనేంటో చూపిస్తానంటూ బెదిరింపులకు దిగారు. కలెక్టర్‌ విజయ్‌రామరాజు బుధవారం ఓటర్ల తొలగింపులు, చేర్పులు వ్యవహారంపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న శ్రీనివాసులరెడ్డి అదే పదజాలన్నీ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ అయిన విజయరామరాజు ఎదుట సైతం ఉపయోగించడం విశేషం.

- క్రమం తప్పకుండా దౌర్జన్యాలు....

ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్లలో పర్యటిస్తున్న మాధవీరెడ్డి ఇటీవల దౌర్జన్యకర ఘటనలకు పాల్పడుతున్నారు. మొన్న టీడీపీ బృందం ప్రచారం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ నేత వినోద్‌కుమార్‌ ఇంటికి వెళ్లారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే అభ్యంతరం చెప్పారు. వెంటనే వినోద్‌కుమార్‌ను టార్గెట్‌ చేసి, స్వయంగా మాధవీరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. శ్రీనివాసులరెడ్డి దంపతులు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను సైతం ఏకవచనంతో సంబోధించడం పరిపాటిగా పెట్టుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. సోషల్‌ మీడియా కేంద్రంగా ఏకవచనంతో సంభోదిస్తూ కావాలనే సామాజికంగా ఎక్స్‌పోజ్‌ చేస్తున్నారని పలువురు భావిస్తున్నారు.

కవ్వింపు చర్యలు మానుకోండి

టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది.వీటిని మానుకోవాలి. అకారణంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్‌ చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, రామాపురం ప్రాంతాలకు చెందిన ప్రైవేటు సైన్యంతో శ్రీనివాసులరెడ్డి, మాధవీరెడి జిల్లా కేంద్రంలో దౌర్జన్యకర ఘటనలకు పాల్పడుతున్నారు. ఇలాంటివి పునరావృతమైతే టీడీపీ నేతలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. – సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కడపను కలుషితం చేస్తే సహించం


టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి కడపలో శాంతిభద్రతలకు భంగం కల్గిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన నేత పీరుల్లాపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. మా నాయకుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజామెప్పుతో నాయకుడిగా ఎదగాలని సూచిస్తున్నారు. టీడీపీ నేతలు రౌడీయిజంతో రాజకీయం చేయాలని చూస్తున్నారు.శాంతియుత వాతావరణంలో ఉన్న కడపను కలుషితం చేస్తే సహించం. –అంజద్‌బాషా, డిప్యూటీ సీఎం

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఖబడ్దార్‌: అహ్మద్‌బాషా



కడప అర్బన్‌: కడప నగరంలో ఇటీవల వరుసగా వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, వాలంటీర్లపై దాడులకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగేలా కడప టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌ మాధవిరెడ్డి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి ప్రవర్తిస్తున్నారని వైఎస్‌ఆర్‌సీపీ యువనాయకుడు ఎస్‌.బి అహ్మద్‌బాషా ధ్వజమెత్తారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఖబడ్దార్‌ అంటూ హెచ్చరించారు. కడపలోని 31వ డివిజన్‌లో ఫ్లెక్సీలకు సంబంధించిన వ్యవహారంలో స్థానికంగా విద్వేషాలను రెచ్చగొట్టడం,11వ డివిజన్‌లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లను చించివేసే ప్రయత్నం చేస్తే అడ్డుకున్న వలంటీర్‌పై దాడి చేయడం సరి కాదన్నారు. తాజాగా 39వ డివిజన్‌లో కార్పొరేటర్‌ షబానాభాను, షేక్‌ కమాల్‌బాషాల కుమారుడు పీరుల్లాపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే వారిపై తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కాగా సంఘటన జరిగిన సమయంలో టీడీపీ నాయకులు కొందరు పోలీస్‌స్టేషన్‌ వచ్చారు. తరువాత వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్పోరేటర్లు చేరకున్నారు. పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌ ఆధ్వర్యంలో సీఐలు తబ్రేజ్‌, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయక్‌, రామచంద్ర, ఎస్‌ఐలు సంజీవరాయుడు, రవికుమార్‌, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, పోలీసు సిబ్బంది బందోబస్తు విధులను నిర్వహించారు.

మాధవీ..మర్యాదగా మసలుకో!



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ మహిళా నేతలు

కడప రూరల్‌ /కడప అర్బన్‌: ప్రశాంతంగా ఉన్న కడపకు వచ్చి విద్వేషాలను నింపుతున్న కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాధవిరెడ్డి మర్యాదగా మసలుకుని ప్రవర్తించాలని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కడప నగర మహిళా నేతలు హితవు పలికారు. గురువారం స్థానిక వైఎస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌ క్లబ్‌లో విలేకరులతో పార్టీ కడప సోషల్‌మీడియా కన్వీనర్‌ సునీతరెడ్డి మాట్లాడుతూ మాధవిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో ఆమె మతిస్థిమితం లేని వ్యక్తిలా ప్రవర్తించడమే కాకుండా డిప్యూటీ సీఎం అంజద్‌బాషతోపాటు వైఎస్సార్‌ సీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బుధవారం రాత్రి 10–12 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి ఫోన్‌ చేసి తనను బెదిరించడమే కాకుండా ఇష్టానుసారంగా దూషించారన్నారు. కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాధవిరెడ్డి నియమితులైనప్పటి నుంచి ఆ పార్టీ కార్యకర్తల ఆగడాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి, కడప డీఎస్పీకి ఫిర్యాదు చేశామని సోషల్‌ మీడియా కన్వీనర్లు సునీతారెడ్డి, నిశాంత్‌లు తెలిపారు. పార్టీ మహిళా విభాగం కడప నగర అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కడపకు మాధవిరెడ్డి శూర్పనఖలా వచ్చారని అన్నారు. పార్టీ నాయకులు పద్మావతి, మరియలు, సుశీల, తులశమ్మ, నారాయణ, నిర్మల పాల్గొన్నారు.

క్లుప్తంగా

విషసర్పం పట్టివేత



రక్తపింజరి విష సర్పంతో స్నేక్ క్యాచర్ నటరాజన్

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గురువారం అటవీ శాఖ అధికారులు రక్త పింజరి అనే విష సర్పాన్ని పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు ఒంటిమిట్టలోని ఎస్సీ కాలనీలో స్వేచ్ఛగా తిరుగుతున్న రక్త పింజరి అనే అతి ప్రమాదకరమైన విష సర్పాన్ని స్థానికులు గమనించి అటవీ శాఖ వారికి సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి వెళ్లి స్నేక్ క్యాచర్ నటరాజన్ సాయంతో పట్టుకున్నారు. అనంతరం ఒంటిమిట్ట అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ ఆపరేషన్‌లో ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య, ఏబీఓలు సరోజ, హేమలత, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది సుబ్బారావు, బాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు పెద్దపీట

- మైనారిటీల పక్షపాతి ఎంపీ మిథున్‌రెడ్డి
- గుంటూరు తబ్లిగీ ఇజ్తిమాకు ప్రత్యేక రైలు సౌకర్యం
- రూ. 30లక్షలు సొంతనిధులతో సమకూర్చిన ఎంపీ



గుంటూరు తబ్లిగీ ఇజ్తిమా ప్రత్యేక రైలుకు సంబంధించి ఉత్తర్వులను చూపుతున్న మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె : రాష్ట్రంలోని ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజికపరంగా స్థాయిని, గుర్తింపును కల్పిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి తబ్లిగీ ఇజ్తిమాకు ముస్లింలు హాజరయ్యేందుకు వీలుగా ఎంపీ మిథున్‌రెడ్డి రూ.30లక్షల సొంతనిధులతో ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించడంపై సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మైనారిటీలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారన్నారు. ముస్లిం కమ్యూనిటీ అవసరాలను గుర్తించి ప్రతి మసీదుకు తిరిగి లక్షల రూపాయల నిధులను సొంతంగా అందించి ముస్లిం పక్షపాతిగా ఎంపీ మిథున్‌రెడ్డి నిలిచారన్నారు. పీలేరు నియోజకవర్గం కలికిరిలో రూ.25లక్షలు సొంతనిధులతో ఎకరా స్థలం కొనుగోలుచేసి ఈద్గా నిర్మించి ఇచ్చారన్నారు. రాజంపేటలో ఈద్గా ఏర్పాటు చేశారన్నారు. గుంటూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి తబ్లిగీ ఇజ్తిమాకు వెళ్లేందుకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని ముస్లిం మతపెద్దలు ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి చేసిన వినతిమేరకు మైనారిటీలపై ఆయనకున్న అభిమానం, గౌరవం, చిత్తశుద్ధిని మరోసారి నిరూపించుకున్నారన్నారు. ములకలచెరువు నుంచి గుంటూరు వరకు రూ.30లక్షలు సొంతనిధులు వెచ్చించి, ఇజ్తిమాకు హాజరై తిరిగి వచ్చేంతవరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇందుకు ముస్లిం మైనారిటీల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గతంలో ముస్లింలకు 4 ఎమ్మెల్యే సీట్లను కేటాయిస్తే.. నేడు ఏకంగా 7 సీట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఉపముఖ్యమంత్రి పదవితో పాటు కేబినెట్ హోదా కలిగిన 12 కార్పొరేషన్లు కేటాయించారన్నారు. ముస్లింలు సుభిక్షంగా, సంతోషంగా ఉండేందుకు వారి హక్కులను పూర్తిగా గౌరవించి, అత్యున్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నందుకు అందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. గుంటూరు తబ్లిగీ ఇజ్తిమాకు వెళ్లేందుకు సౌకర్యాలు కల్పించాల్సిందిగా ముస్లిం పెద్దలు కోరిన వెంటనే మంచి కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించండంటూ పెద్దమనస్సుతో ఎంపీ మిథున్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. మదనపల్లె రైల్వేస్టేషన్ నుంచి 9వ తేదీ రాత్రి 10గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటిరోజు గుంటూరుకు చేరుకుని, ఇజ్తిమా ముగిసిన అనంతరం తిరిగి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, పీలేరు మాజీ సర్పంచ్ హబీబుల్లా, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, గుండ్లూరు రఫీ, ఎస్.కరీముల్లా, సలీం, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో ఇస్తిమాకు ఉచిత రైలు సౌకర్యం

కలికిరి : గుంటూరు జిల్లా నంబూరులో ఈ నెల 10, 11వ తేదీలలో జరుగనున్న ఇస్తిమా కార్యక్రమానికి ఎంపీ పీవీ మిథున్ రెడ్డి తన సొంత నిధులతో ఉచిత రైలు సౌకర్యం కల్పించినట్లు రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. గురువారం కలికిరిలో మసీదు ముతవల్లీలు, మత పెద్దలకు సమాచారమిచ్చారు.

పీలేరు : గుంటూరులో నిర్వహించనున్న ఇస్తిమా కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులతో ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీలతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ జీనత్‌షఫీ, గడి బాషా, హుమయూన్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంత ఇంటి కల నెరవేరింది



నాకు వివాహమై దాదాపు 15 ఏళ్లు అయింది. గత ప్రభుత్వం నాకు ఇంటి స్థలం మంజూరు చేయలేదు. కాని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులో హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు. సంతోషంగా ఉంది.

-నాటకరాణి యానాదమ్మ, ఒంటిమిట్ట

నాడు–నేడు ఒక బృహత్తర పథకం



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నాడు–నేడు అనే బృహత్తర పథకంతో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మార్చేశారు. ఈ రోజు కార్పొరేట్ పాఠశాలలకు మించి వసతులు కలగడం సంతోషదాయకం. ముఖ్యంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, సురక్షిత మంచి నీటి వసతి వంటి మౌలిక వసతులతో పాటు, మధ్యాహ్న భోజన పథకంలో రోజుకు ఒక మెనూ, ప్రతి రోజు గుడ్డు, చిక్కి, రాగి జావ ఇస్తున్నారు. ఇలాంటివి చూస్తే విద్యార్థులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ ఏమిటో తెలుస్తుంది.

- చంద్రశేఖర్, ఒంటిమిట్ట జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు

పేకాట రాయుళ్ల అరెస్టు

కలికిరి : మండల పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. వీరి నుంచి రూ.5300 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడి మృతి

- దిగువ దొనబైలుగుర్రోళ్ల గుట్ట వద్ద ఘటన
- జనవరి 28న మిస్సింగ్ కేసుగా నమోదు
- హత్యా? ఆత్మహత్యా?



మండెం శ్రీనివాసులు (ఫైల్)

మదనపల్లె : కనిపించకుండా పోయిన చేనేత కార్మికుడు మండెం శ్రీనివాసులు (34)మదనపల్లి మండలం చీకల బయలు పంచాయతీ దిగువ దొనబైలు గుర్రోళ్ల గుట్ట వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు గురువారం వెలుగుచూశాయి. మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా పలు విషయాలు బయటకు వచ్చాయి. తాలూకా సీఐ ఎస్.శేఖర్, టూ టౌన్ ఎస్ఐ వెంకట సుబ్బయ్య గురువారం సాయంత్రం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన నరసింహులు, శాంతమ్మల కుమారుడు మండెం శ్రీనివాసులు (34), చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో గుర్రంకొండ మండలం తరిగొండలో ఉన్న మేనమామ వెంకటరమణ వద్ద పెరిగాడు. ఆయన శ్రీనివాసులుకు చేనేత పనులు నేర్పించేందుకు మదనపల్లి నీరుగట్టు వారి పల్లెలో చేర్పించాడు. దీంతో చేనేత కార్మికుడిగా శ్రీనివాసులు స్థిరపడ్డాడు. ఈ క్రమంలో మదనపల్లి మండలం పంచాయతీ దిగువ దొనబైలు గ్రామానికి చెందిన రామస్వామి కుమార్తె గీత ను 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. వివాహానంతరం శ్రీనివాసులుకు స్వగ్రామంలో ఆస్తికి సంబంధించి కొంత నగదు రావడంతో చీకలబైలులో స్థలం కొన్నారు. ఆ స్థలంలో కొంత మేర ప్రభుత్వం గీత పేరున పక్కాగృహం మంజూరు చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో గీత పుట్టిల్లు అయిన దిగువ దొనబయలకు వెళ్లిపోయింది. కొద్దిరోజుల పాటు చీకలబైలులో ఉన్న శ్రీనివాసులు తర్వాత మదనపల్లిలోని నీరుగట్టువారిపల్లె మునెప్ప కాలనీకి వచ్చాడు. చేనేత పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో తరచూ తన పిల్లలను చూసేందుకు చీకల బైలుకు వెళ్లేవాడు. ఆ విధంగా జనవరి 26వ తేదీన పిల్లలను చూసేందుకు చీకలబైలుకు వెళ్లాడు. పిల్లలను కలిశాడు. అదే రోజు రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఈ విషయాన్ని మేనమామ వెంకటరమణకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అయితే మరుసటి రోజు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో మేనమామకు అనుమానం వచ్చింది. ఈ క్రమంలో కర్ణాటక రాయల్పాడు పోలీసులు శ్రీనివాసులుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని రాయల్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కనుగొన్నారు. వాహనం నెంబర్ ఆధారంగా ఫోన్ చేయగా వారు వెంకటరమణ ఫోన్ నెంబర్ ఇచ్చారు. దీంతో పోలీసుల పిలుపుమేరకు వెంకటరమణ రాయల్పాడు వెళ్లి విచారించాడు. అనంతరం మదనపల్లి చేరుకుని తాలూకా పోలీస్ స్టేషన్ లో శ్రీనివాసులు మిస్సింగ్ పై ఫిర్యాదు చేయగా తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం శ్రీనివాసులు మునెప్ప కాలనీలో ఉండటంతో మూడు రోజుల తర్వాత టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. టూ టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసును దర్యాప్తు చేస్తుండగా పలు విషయాలు తెలిశాయి. అందులో భాగంగా చీకల బయలు పంచాయతీ దిగువ దొనబైలు గ్రామ సమీపంలోని గుర్రోల గుట్ట సమీపంలో వ్యక్తిని పూడ్చిపెట్టారన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందింది. తాలూకా సీఐ ఎస్.శేఖర్, వెంకటసుబ్బయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చీకటి పడడంతో గొయ్యిని తవ్వటం వీలు కాలేదు. శుక్రవారం గొయ్యిని తవ్వితే అసలు విషయం తెలిసే అవకాశం ఉంది. 12 రోజుల క్రితం కనిపించకుండా పోయిన శ్రీనివాసులు అనుమానాస్పదంగా మృతి చెందటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య? లేక ఆత్మహత్య? అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దమండ్యం: మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి. వెంకటేష్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంకొండ మండలం నడింకండ్రికకు చెందిన దశరథి (32) గురువారం ఉదయం పెద్దమండ్యం బస్టాండుకు సమీపంలో మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. అతని వద్ద ఉన్న 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



జయలక్ష్మి (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై మదనపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పట్టణంలోని బీసెంట్ రోడ్ లో నివాసం ఉంటున్న బి. శ్రీనివాసులు, బి. జయలక్ష్మి దంపతులు. వీరికి శ్రీనివాసులు తమ్ముడైన బి. రమణ, ఈ. రవిలతో విభేదాలు ఉన్నాయి. గతంలో వీరు జయలక్ష్మి పై దాడికి పాల్పడడంతో ఆ కేసు కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం కోర్టు వాయిదాకు ఇరు వర్గాలు హాజరయ్యారు. కోర్టు బయటకు వచ్చిన అనంతరం నిందితులు జయలక్ష్మిని దూషించారు. ఈ ఘటనపై దంపతులిద్దరూ తీవ్ర మనస్తాపం చెందారు. ఆ అవమానాన్ని భరించలేక జయలక్ష్మి గురువారం ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త శ్రీనివాసులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో, రాత్రి వన్ టౌన్ పోలీసులకు తన భార్య మిస్సింగ్ పై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వలి బాషు తెలిపారు.

కుటుంబ కలహాలతో దాడి

రామాపురం : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై అతని భార్య, కుమారులు కలిసి దాడి చేసిన సంఘటన మండలంలోని గువ్వలచెరువు గ్రామంలో ఈనెల 5వ తేదీన జరిగింది. ఈమేరకు బాధితుడు షేక్ షంషీర్‌బాషా గురువారం కడప రిమ్స్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్ రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లికి చెందిన షంషీర్ బాషా రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన హసీనా బేగంను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు హనీఫ్ బాషా, హుసేన్‌బాషా ఉన్నారు. ఈనెల 5వ తేదీన ఇంటికి వచ్చిన షంషీర్‌బాషాపై భార్య, పిల్లలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడిని స్థానికుల సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రిమ్స్ ఆసుపత్రిలోని ఔట్ పోస్టులో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



హత్యకేసులో నిందితుడు గుడిటి పవన్ కుమార్

రాయచోటి టౌన్ : హత్య కేసులో నిందితుడు గుడిటి పవన్‌కుమార్ (26)కు రాయచోటి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. రాయచోటి రూరల్ సీఐ యం. తులశీరాం, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కె హుస్సేన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం కొండల తూర్పు గ్రామంలో గత ఏడాది జూన్ 16వతేదీన చిన్నరెడ్డివారి రామాంజుల రెడ్డి ఆయన భార్య మనోహరితో కలసి ఆయన పొలం వద్ద ఉన్న ఆవుల షెడ్‌లో నిద్రిస్తున్నారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన గుడిటి పవన్‌కుమార్ తన భర్తతో కలిసి నిద్రిస్తున్న మనోహరి ఒంటిపై నగలు కాజేసేందుకు యత్నించి ఆమె భర్త కళ్లలో కారం చల్లాడు. అయితే అతను ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న కొడవలితో విచక్షణా రహితంగా గొంతుపై నరికాడు. దీంతో రామాంజుల రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై అప్పటి సీఐ లింగప్ప, సుండుపల్లె ఎస్ఐ బి. రామకృష్ణారెడ్డిలు విచారణ నిర్వహించి నిందితుడిపై క్రైం నంబర్ 67/2023 కింద హత్య కేసు నమోదు చేశారు. గురువారం ఇరువురి వాదనలు విన్న తరువాత నేరం రుజువు కావడంతో జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి ఐపీసీ 302 ప్రకారం జీవిత ఖైదుతో పాటు రూ.2000లు జరిమానా, అలాగే ఐపీసీ 307 ప్రకారం 7 సంవత్సరాలు జైలు జీవితం, రూ.1000లు జరిమానా, ఐపీసీ 382 ఆర్/డబ్ల్యూ 511 కింద జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జగన్ మోహన్‌రెడ్డి వాదించారు.

ఇంటి నుంచి అలిగి వచ్చిన బాలుడి అప్పగింత

కలికిరి: తల్లిదండ్రులపై అలిగి వచ్చిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన 5వ తరగతి విద్యార్థి గురువారం తన తల్లిదండ్రులపై అలిగి వచ్చి కలికిరిలో సంచరిస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో బాలుడిని విచారించిన సీఐ అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడి మృతి



మాజీ సైనికుడికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ములకలచెరువు: బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన మాజీ సైనికుడు గురువారం కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని చౌడసముద్రం పంచాయతీ చెంచువారిపల్లికి చెందిన నాగభూషణం నాయుడు (57) బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందాడు. అనంతరం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో నాగభూషణం నాయుడు బెంగళూరు నుంచి తన ద్విచక్ర వాహనంలో స్వగ్రామమైన చెంచువారిపల్లికి వస్తుండగా హొస్‌కోట సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం అందుకున్న బీఎస్ఎఫ్ సెక్యూరిటీ ఎస్ఐ తిమ్మిరెడ్డి చెంచువారిపల్లికి చేరుకుని మృతదేహంపై జాతీయ జెండాను కప్పి నివాళి అర్పించారు. అంత్యక్రియల కోసం రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ రాంబాబు నాయుడు, మహేశ్వరి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కడపలో 25న కెమిస్ట్ భవనం ప్రారంభం



రైల్వేమెడికల్ ఆఫీసర్ జయభాస్కరరావుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న డ్రగ్గిస్టులు

రాజంపేట : కడపలో ఈనెల 25న ఆదివారం ఉదయం 10 గంటలకు కెమిస్ట్ భవనం ప్రారంభించనున్నట్లు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి తెలిపారు. గురువారం నందలూరులో రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయభాస్కర్‌రావును కలిసి కెమిస్ట్ భవనం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను నందలూరు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగె మణి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కర్నూలు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ వి.విజయశేఖర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్ అసోసియేషన్ సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి ఎం.సుబ్బారావు, బిల్డింగ్ కమిటీ చైర్మన్ కేవీ సుబ్బారావు, కో–చైర్మన్ ఎం.సుబ్బారావు, నందలూరు కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగె సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

నందలూరు(రాజంపేట) : చెక్ బౌన్స్ కేసులో నందలూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి కె.లత ముద్దాయికి ఆరునెలల జైలుశిక్ష, పరిహారం చెల్లించాల్సిందిగా గురువారం తీర్పు వెలువరించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ, జెండామాను వీధికి చెందిన అబ్దుల్ గని అనే వ్యక్తి షేక్ నజీర్ అహ్మద్ వద్ద రూ. 2.20 లక్షలు అప్పుగా తీసుకొని ఆ మొత్తానికి చెక్కును అందజేశారు. సదరు చెక్కు బౌన్స్ కావడంతో ఆరునెలలు జైలు శిక్ష విధించడంతోపాటు చెక్కు విలువ పరిహారంగా షేక్ నజీర్ అహ్మద్‌కు ఇవ్వాలసిందిగా తీర్పు చెప్పారు. అదే విధంగా మరో కేసులో పాటూరుకు చెందిన షేక్ సత్తార్ వద్ద నుంచి నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గని ఆరు లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని సదరు మొత్తానికి చెక్కును అందజేశారు.

ఈ చెక్కు బౌన్స్ కావడంతో ముద్దాయికి ఆరు నెలలు జైలుశిక్ష విధించడంతోపాటు చెక్కు విలువ రూ. 6 లక్షలు అబ్దుల్ సత్తార్‌కు చెల్లించాలని జడ్జి తీర్పు వెల్లడించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నందలూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఒక ముద్దాయికి నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి లత తీర్పు ఇచ్చారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహులు

మదనపల్లె / బి.కొత్తకోట : ఒంటరితనం, అనారోగ్యం భరించలేక ఓ వ్యక్తి మనస్థాపంతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న గంగులప్ప కుమారుడు నరసింహులు (58), ఒంటరిగా నివసిస్తున్నాడు. భార్య, కుమారులు ఉపాధి కోసం బెంగళూరు వెళ్లిపోయారు. అంతేకాకుండా అనారోగ్యం బారిన పడి ఒంటరిగా జీవిస్తూ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇంట్లోనే కత్తితో గొంతు కోసుకున్నాడు. గమనించిన స్థానికులు నరసింహులు ఇంటి వద్ద పెద్ద ఎత్తున గుమికూడారు. స్థానికంగా నివాసం ఉన్న భాస్కర్ మానవతా దృక్పథంతో బాధితుడిని 108 వాహనంలో స్వయంగా తీసుకువచ్చి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేర్పించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. భాస్కర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 108 వాహనంలో తిరుపతికి తీసుకెళ్లారు.

తండ్రి మందలించాడని..

తండ్రి మందలించడంతో మనస్థాపం చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. చలిమామిడి పంచాయతీ దయ్యాలవారి పల్లెకు చెందిన కృష్ణారెడ్డి కుమారుడు రాజశేఖర్ రెడ్డి (24), ఇంట్లో తండ్రి మందలించాడన్న మనస్థాపంతో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

టెంకాయల వేలంపాట రూ. 7లక్షల 65వేలు

రాజంపేట రూరల్: అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దేవదాయశాఖ అధికారి జి.కొండారెడ్డి ఆధ్వర్యంలో టెంకాయల వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించారు మందరం గ్రామానికి చెందిన జి.ఎల్లయ్య దేవస్థానం పరిధిలో ఒక సంవత్సరం కాలానికి టెంకాయలను విక్రయించుకునేందుకు రూ.7,65,0000లతో వేలంపాటను దక్కించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి.శివయ్య, దేవస్థానం చైర్మన్ వెలగచర్ల వెంకటసుబ్బారెడ్డి, పాల్గొన్నారు.